మినీ కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# హైజాకింగ్

బి.యస్.ఎన్. మూర్తి

తస్కర దేశానికీ, ముష్కర దేశానికీ మధ్య సరిహద్దు ప్రాంతంలో ఒక వజ్రం దొరికింది. తస్కర దేశం దాన్ని సొంతం చేసుకుంది. దాని గురించి ముష్కర దేశంలో ఆందోళన చెలరేగింది. పర్యవసానంగా చర్చలు, ఆవేశాలు, చిన్న చిన్న యుద్ధాలు రెండు దేశాల మధ్య చెలరేగాయి.

తస్కర దేశానికి రాజు 'దేశభక్త' అతను తన అనుచరులయిన కాకారావు, కేకారావు, తోకారావులతో దేశాన్ని పరిపాలిస్తూండగా ఒక రోజు ఒక ఘోరం జరిగిపోయింది

దేశభక్తగారు దేశ సేవా కార్య నిర్వహణలో మిత్రదేశాలు కొన్ని పర్యటిద్దామని విమానంలో బయలు దేరారు. దారిలో ముష్కర దేశానికి చెందిన దుండగులు కొందరు ఆ విమానాన్ని హైజాక్ చేసి తమ రాజ్యం చేర్చారు. ఒక్క దేశభక్తుని మాత్రం బందీగా ఉంచి మిగతా ప్రయాణీకుల నందరినీ వదిలిపెట్టేశారు.

సరిహద్దులో దొరికిన వజ్రాన్ని తమకిచ్చేస్తే దేశభక్తుడ్ని వదిలిపెడతామని వాళ్లు రాయబారం పంపించారు.

దేశభక్త అనుచరులు ముగ్గురూ తస్కర దేశంలో తర్వాత కార్యక్రమం గురించి చర్చించేందుకు అర్జంటుగా సమావేశమయ్యారు.

చర్చలు శిఖరాగ్రస్థాయిలో జరిగాయి.

దేశభక్తుని రక్షించుకోవటమా, వజ్రాన్ని దక్కించుకోవటమా అనే విషయంలో వివిధ రకాలయిన అభిప్రాయాలు వచ్చి వివాదం చెలరేగింది. ఎటూ తేలలేదు. ఆ గొడవ అలా అలా పెరిగి వజ్రం సంగతి ఎలా వున్నా ముందు సింహాసనం ఎవరు అధిష్ఠించాలన్న ఆలోచన వచ్చింది.

ఏదేమయినా ముందు ఈ విషయం ప్రజలకి తెలియజేసి వారి మద్దతుని సమీకరించాలన్న నిర్ణయానికొచ్చారు.

ఆకాశవాణిలో ఈ విషయం ప్రకటించబడింది. పత్రికలలో పతాక శీర్షికలతో ఈ వార్త ప్రచురింపబడింది. కాని- ప్రజల్లో ఎక్కడా ఎలాంటి అలజడి కలగలేదు. ఆసక్తి కనిపించలేదు.

దేశభక్తగారి అనుచరులు ఖంగుతిని ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకున్నారు.

బహిరంగ సభలు జరిపి ప్రజలకు నచ్చచెప్పే ప్రయత్నం కూడ చేశారు. ఆ ప్రయత్నమూ విఫలమయ్యింది. ప్రజలు పెదవి విరిచేశారు. దేశభక్త కాకపోతే మరొకడు రాజవుతాడని అరిచేరు. వజ్రం వున్నా వూడినా మా కడుపులు నింపేదేం లేదని తేల్చేశారు.

అనుచరులు ముగ్గురూ హతాశు

లయ్యారు. మళ్ళీ రహస్య సమాలోచన చేశారు.

“మనం యుద్ధం ప్రకటిస్తే?”

“అమ్మో, వద్దు యుద్ధం అంటే ముందు వాళ్లు దేశ భక్తుని చంపేస్తారు. జీవుడు నిష్కారణంగా సెటిలయి పోతాడు. ఆ పాపం మనకొద్దు అలాగే కొన్నాళ్ళు వాళ్లకి బందీగా వుంటాడు. అంతే కదా!” అన్నాడు తోకారావు.

“మరి దేశానికి తక్షణం రాజు కావాలి. లేకపోతే పొరుగు దేశాలు మనమీద దాడిచేసే ప్రమాదం ఉంది.



అందుచేత నేను సింహాసనం ఎక్కేసి దేశాన్ని ఆ ఘోర విపత్తునుండి కాపాడుతాను.” అన్నాడు కాకారావు.

అందుకుమిగతావాళ్లు ఒప్పుకోలేదు. దాంతో రాజు ఎన్నిక సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

ఈ వరస చూసి ముష్కరదేశ దుండగులకి విసుగెత్తి పోయింది. తస్కరదేశంవాళ్లు దేశభక్తని విడిపించుకునే ప్రయత్నం ఎంతకీ చేయక పోవడంతో అతన్నింక మేపడం అనవసరమనుకొని విడుదలచేసేశారు.

దేశభక్త జైల్లోంచి రాగానే అక్కడి నేలమీద మట్టిని తీసుకుని దాంతో నుదుట తిలకం దిద్దుకున్నాడు.

అక్కడివారు ఆశ్చర్యపోయి సంగతేమిటని అడిగారు.

“ఇన్నాళ్లూ ఈ దేశంలో ఉన్నాను. ఈ గాలి పీల్చాను. ఇక్కడి నీరు త్రాగాను. నాలో మీ దేశంమీద దేశభక్తి పెల్లుబికి పోయింది. అందుచేత మీకు ద్రోహం చేయలేను. నన్ను మీరొదిలేసినాసరే యిక్కడే వుండి నా సర్వశక్తులూ వెచ్చించి మీ దేశానికి సేవ చేస్తాను” అన్నాడు దేశభక్త.

ఆ మాటలతో ముష్కరదేశ దుండగులకి మతి పోయింది. మా దేశంలో వద్దు. వజ్రంసంగతి దేవుడెరుగు. మా వజ్రాన్ని కాజేసినందుకు ముందు నిన్నక్కడికి పంపించెయ్యడమే నీ అనుచరులకీ, నీ ప్రజలకి తగినశిక్ష” అని అతణ్ని విమానం యెక్కించి మళ్లీ బలవంతంగా అతని దేశానికి పంపించేశారు.